ఒక జిల్లా జీవితాల్ని శాసించే కార్యాలయం.

కొండ రాళ్ళతో ఎత్తుగా కట్టబడి ఉంది. చుట్టూ ఎత్తైన ప్రహరీ ఉంది. ఈ రెండింటి కంటే ఎత్తైన పెద్ద రావిచెట్టు తన కొమ్మల్ని నాలుగు వైపులకూ పరుచుకుని, ఆకుల గలగలల్లో అర్థంకాని భాషను గాలితో మాట్లాడుతూ గంభీరంగా నిలబడి ఉంది.

దాని మొదలు చుట్టూ సిమెంటు దిమ్మ ఉంది.

ఉదయం పది గంటల సమయం. జనం తలల మీద పడే తిన్నని సూర్య కిరణాలు తెలు పెక్కుతున్నాయి.

చప్పగా ఉండే జనాన్ని చొప్ప కట్టల్లో విదిలించి కార్యాలయం గేటు దగ్గర గావు కేక ఒకటి పెట్టి సిటీ బస్సు వేగంగా వెళ్ళిపోయింది. అందులో ఒకడుగా, చెరిగిన జుట్టును సవరించుకుంటూ శర్మ బయట పడ్డాడు. అదిరి పడే ఎండనూ, అందలాల అధికారులనూ తలుచుకుంటూ రావి చెట్టు కిందికి చేరాడు. గతంతాలూకు తండ్రిమిగిల్చిన గడియారంలో వర్తమానాన్ని గంటలుగా చూసుకుని, భవిష్యత్తును గురించి భయం భయంగా ఆలోచించుకుంటూ అరుగుల మీద చతికిల పడ్డాడు.

"సోడా కావాలా, బాబూ?" సోడా అమ్మే మనిషి ముందుకు వచ్చి అడిగాడు. ఎదురుగా కనపడే పంపు నుండి నీటి చుక్కలు కిందికి రాలుతూంటే ఏదో నల్లటి పక్షి గొంతెండి తాగుతూంది. తనకూ దప్పికగా ఉన్నా, పదిహేను పైసలు దాని కోసం ఖర్చు చెయ్యటం ఇష్టం లేక అక్కర్లేదని చెప్పాడు. శర్మ వంక అదోక రకంగా చూసి వాడు వెళ్ళిపోయాడు.

పంపు దగ్గర పక్షి నీళ్ళు తాగి వెళ్ళిపోయింది. తనకూ తాగాలనిపించి, పంపు దగ్గరికి పోయి నోరు తడుపుకున్నాడు. నీరు నవ్వగా ఉన్నాయి.

'రంగు, రుచి, వాసన లేని నీరు ఆరోగ్యకరమైనది'—చిన్ననాడు చదివింది గుర్తుకు రాగా చిన్నగా నవ్వుకుని, నాలుగు గుక్కలు తాగి, కాళ్ళూ ముఖమూ కడుక్కున్నాడు. చిల్లులు పడ్డ జేబు రుమాలుతో చెమట కడిగిన ముఖాన్ని శుభ్రం చేసుకుని మరల చెట్టు కిందికి వచ్చాడు.

'కాలక్షేపం బఠాణీలు, బాబూ. కావాలా తమకు?' బఠాణీల బుట్టతో ఒక మనిషి ముందుకు వచ్చాడు. శర్మ అతని వంక పరీక్షగాచూశాడు. నల్లగా, గూనిగా, వికారంగా ఉన్నాడు మనిషి.

ఈ దేశంలో రెండు రకాల మనుషులు ఉంటారని శర్మ ఊహించాడు. కొందరు కాలక్షేపం మనుష్యులు. బతికినంత కాలం కాలక్షేపంగానే బతుకుతారు. వారి వల్ల ఇతరులకు ఉపయోగం ఉండదు. కొందరికయితే వారి వల్ల వారికే ఉపయోగం ఉండదు. ఈ కాలక్షేపం జాబితాలో నిరుద్యోగులు మొదలు సామాన్యుల వరకూ ఉంటారు.

మరొక రకం మనుష్యులు. వారి దేశానికి చాలా అవసరం. గాలి లేకుంటే ఆకు కదల నట్లే వారు లేకుంటే ఏదీ కదలదు. కదులుతూ, కదిలిస్తూ బతుకుతారు వాళ్ళు!

బతుకుల ఫైళ్ళు వారి చేతుల్లోనే కదులుతాయి. కార్లూ, స్కూటర్లూ వారి కాళ్ళ కింద కదులుతాయి. కరెన్సీ రెపరెపలు వారి చేతుల్లో, బీరువాల్లో కదులుతాయి. బాంకు కౌంటర్స్ దగ్గరా, భవంతుల చలువ నీడల్లోనూ వారి ఆకారాలు కదులుతాయి.



## —బొల్లిముంత నాగేశ్వరరావు

శర్మ చిన్నగా నవ్వుకుని మరల ఊహించటం మొదలు పెట్టాడు.

కాలక్షేపం మనుష్యులు మాత్రం కదలటం లేదా?

కదులుతారు. కాలక్షేపంగా కదులుతారు. ఒక వేళ వాళ్ళు కదలక పోయినా ఈ కాలానికి ఏమీ ఇబ్బంది ఉండదు. కరెన్సీ వాళ్ళ జేబుల్లో ఉండదు కాబట్టి వాళ్ళు కదిలినా కదలనట్టే లెక్క.

నిరుద్యోగి ఉరి పెట్టుకున్నా, సామాన్యుడు సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకున్నా ఇక్కడ ఎవరికీ ఇబ్బంది ఉండదు. బారు షాపుల పని జోరుగానే సాగుతుంది. బదులు మూత పడవు. ఈ జాతీయ




ఈ నల్లని రాలలో ఏ వెన్నెల దాగెనో! - పావని కిరణ్ (తెనాలి)

జీవనంలో ఒక నిండు జీవి అకారణంగా, అన్యాయంగా చనిపోయిందే అని ఏ రేడియో స్టేషను వాళ్ళూ విలాప సంగీతాన్ని ఆలాపించరు. ఏ కార్యాలయం ముందూ విషాదంగా జెండా సగానికి దిగదు. సానుభూతిగా సభలు జరగవు.

అందుకే ఈ గూని మనిషి బుట్టలో బటాణీలు నింపుకుని, ఈదేశంలో కాలక్షేపం మనుషులముందుకు వచ్చి, ఇది మీ సరుకే—కొనండి, బాబూ! అంటు న్నాడు.

శర్మ మనసులో అనుకుని, నవ్వుకుంటూ నిట్టూ ర్చాడు.

జేబులో నుండి పది పైసలు తీసి అతని చేతిలో పెట్టాడు. అంగుళం పొడవూ, అరంగుళం వెడల్పూ ఉన్న చిట్టి రేకు గిద్దలోంచి సరిగ్గా పది గింజలు మాత్రమే వచ్చేటట్టు కొలిచి, శర్మ చేతిలో పోసి అతడు వెళ్ళిపోయాడు.

శర్మకు వాటిని తినాలనిపించ లేదు. తింటే అయిపోతాయి. కావాలని ఆశించిన కాలక్షేపం దొరక్క పోవచ్చు. ఇంటర్‌వ్యూ చేసే అధికారులు తన నంబరు పిలిచే వరకూ వీటితోనే కాలక్షేపం.

కుడి చేతిలోనుండి ఎడమ చేతిలోకీ, ఎడమ చేతిలో నుండి కుడి చేతిలోకీ లెక్క బెడుతూ, అవ్యక్తమైన కార్యాన్ని దృష్టిలో పెట్టుకుని, అర్థం కాని మంత్రోచ్చారణను కాలానికి జోడించి, పూసల్ని లెక్క పెట్టే పిచ్చి యోగిలా శర్మ చెట్టు క్రింద కూర్చున్నాడు.

* * *

ఆకలి దహిస్తూంది. తన నంబరు ఇంకా రాలేదు. సాయంత్రం నాలుగు గంట అయింది. అధికారు లడిగిన తిక్క ప్రశ్నలకు బిక్క ముఖం వేసుకుని నిరుద్యోగు లందరూ వీళ్ళు కాని ఇళ్ళకు వెళ్ళి పోతు న్నారు.

7—1—81

శర్మకు కోపం పెరుగుతూంది. వారు ఇవ్వబోయే గాడిదగుమాస్తా ఉద్యోగాలకూ, అడిగే ప్రశ్నలకూ సంబంధం ఉండటం లేదు. అస లవి ఎందు కడుగు తారోకూడా అర్థం కావటం లేదు. తాము తీసుకున్న ఈ డిగ్రీల ప్రయోజనంకూడా అతనికి అంతు బట్టలేదు.

ఇంతలో మరో ఏభై నంబర్లు పిలిచారు.

అందులో తన నంబరు ఉండటంతో శర్మ ఉలిక్కి పడ్డాడు. పోయి వరసలో నిలబడ్డాడు.

తను చదువు మాని సరిగ్గా ఎనిమి దేళ్ళయింది. చదువుకున్న దానిలో ఎక్కువ భాగం మరిచి పోవటం జరిగింది. అయినా ఆ మరిచి పోయిన చదువుకూ, ఇస్తే వెలగబెట్టే ఈ గుమాస్తా ఉద్యోగానికీ ఏమీ సంబంధం లేదు. విషయాన్ని ఇంగ్లీషులో వ్రాయ టమూ, సంఖ్యల సంకలనమూ, వ్యవకలనమూ, కాకుంటే గుణకారమూ, భాగహారమూ. అంతకంటే ఈ గుమాస్తా ఉద్యోగానికి మరేమీ అక్కర్లేదు. అవి తనెంతో నీట్‌గా పూర్తి చేయగలడు. శర్మ ఆలోచిస్తున్నాడు. ఏం ప్రశ్న లడుగుతారో?

ఇంతలో అతని వంతు వచ్చింది.

స్ప్రింగ్ డోర్ తెరచిన అటెండర్ లోనికి పొమ్మన్నాడు.

శర్మ లోనికి అడుగు పెట్టాడు. జిల్లా అధికారులు వరసగా కూర్చుని ఉన్నారు. కాళ్ళకు బూట్లు, కళ్ళకుజోళ్ళు, మల్లె పూవుల్లాంటి తెల్లనివస్త్రాలు— మనుష్యులు నిండుగా ఉన్నారు. వారి దయాభిక్షతో తన జీవితం ఒక గాటిన పడుతుంది.

కానీ, వారిదయకు 'భిక్ష' అంటూ ఉందో, లేదో? అది ఖరీదయిందయితే తను కొనలేడు.

అంతగొప్పవాళ్ళు 'దయ'ను కూడా అమ్ము కుంటారనీ, అలా అమ్ముకునే వాళ్ళే గొప్పవారవుతా రనీ తా ననేక పర్యాయాలు విన్నాడు. వారినిచూడగానే ఆ విషయం గుర్తుకు వచ్చింది.

అందరికీ ఒకనమస్కారం పడేశాడు. ఆ అందరిలో ఎవరూ తనకు తిరిగి నమస్కారం చెయ్యలేదు. అయినా తను కోరింది తిరిగి నమస్కారం చేయడం కాదు.

"ఏమోయ్? నీ పేరు శశికాంతశర్మా?"

"అవును, సార్!"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"బి. ఎ. పాస్ అయ్యాను."

ఇంతలో మరొక ఆఫీసరు కల్పించుకున్నాడు—

"బి. ఎ. లో ఏ సబ్జెక్టు అంటే ఇష్టంగా చదివే వాడివి?"

"అప్పట్లో తెలుగూ, చరిత్రా, ఇంకా—" శర్మ పూర్తి చెయ్యలేదు.

"అయితే 'గంగిగోవు పాలు' పద్యం చెప్పగలవా?" ఆయనే అడిగాడు.

శర్మకు ఆశ్చర్యం వేసింది. ఇంత చిన్న పద్యానికే ఇక్కడ ఉద్యోగం వస్తే — తనకంటే మూడవ తరగతి పిల్లవాడు దాన్ని చక్కగా చదవగలడు. లాంఛన ప్రాయమైన ఈ తతంగంలో ఈ ప్రశ్న ఒక ఫార్సు. తా నీ పద్యం అప్పజెప్పి మెట్లు దిగి పోతూంటే వెనక

వీరందరూ నవ్వగలరు. తన దీనస్థితికి ఇదొక ఎగతాళి ప్రశ్న.

పద్యంగొప్పదే కావచ్చు. మధ్య యుగాల్లో మహాకవి వేమన వ్రాసిందే కావచ్చు. కానీ, వారికి తనకు ఉద్యోగం ఇవ్వాలనే ఉద్దేశ్యం ఉంటే ఈ ప్రశ్న అడగరు.

శర్మకు కొంచెం కోపం కూడా వచ్చింది. వెంటనే-

"ఆ పద్యం మరిచిపోయాను!" అన్నాడు.

"ఎందుకని?" మరొక ఆఫీసరు ప్రశ్న.

"ఆ పద్యం లో పరిస్థితులు ఈ దేశంలో లేవు కనక!"

"అంటే?"

"మా దొక పల్లెటూరు. చెరువుల్లో నీరు తప్ప మాకు తాగటానికి ఏమీ లేవు. మొన్న వేసవిలో చెరువు ఎండి పోయింది. ప్రజలు తహతహలాడిపోయారు. గంగిగోవు పాలలాంటి గరిటెడు నీళ్ళు ఎవరూ వారికి సప్లై చెయ్యలేదు. ఖరముపాలో, ఈ దేశం ఖర్మ పాలో ప్రభుత్వపు సారాయి షాపులోకి మాత్రం లారీల్లో పీపాల నిండా సారా దిగింది! ఆ మహాకవి తన పద్యంలో ఆశించిన పవిత్రత ఇక్కడ గరిటెడు కూడా లేదు కాబట్టే — నేనా పద్యాన్ని మరిచిపోయాను."

"రాజకీయాలంటే నీ కిష్టమా?" మరొక ఆఫీసరు అడిగాడు.

"కాదు." శర్మ తెగేసినట్లు సమాధానం చెప్పాడు.

"చరిత్ర అంటే ఇష్టం అన్నావు కదూ? తుఘ్లక్ తన రాజధానిని ఎక్కడి నుండి ఎక్కడికి మార్చాడు?" మొదటి ప్రశ్న వేసిన ఆఫీసరే మరల అడిగాడు.

శర్మకు మరింత కోపం వచ్చింది.

"క్షణానికి ఒక రాజకీయపు రంగును మార్చే తుఘ్లక్ వారసత్వాన్నీ, పూసరవెల్లి అవకాశవాదాన్నీ గుర్తుపెట్టుకుంటూ ఎక్కాల్లా మననం చేసు కుంటూ కూర్చుంటే నా బోటి సామాన్యుడికి కడుపు నిండదు కనక ఆ ఢిల్లీ, దేవగిరుల వారసత్వాన్ని మరిచిపోవాలనే మరిచిపోయాను!"

"మరేం గుర్తు పెట్టుకున్నావు?" ఎవరో ఆఫీసరు సవ్యంగా అడిగాడు.

"నేను సరిగ్గా బి. ఎ. పాసై ఎనిమిది సంవత్సరా లయిందని గుర్తు పెట్టుకున్నాను. ఈ ఎనిమిది సంవత్సరాలూ నేను ఎలా బ్రతికానో, బ్రతుకు తున్నానో నన్నెవరూ ఒక మాట కూడా అడగలేదని గుర్తు పెట్టుకున్నాను."

శర్మ పూర్తిచెయ్యకుండానే మధ్యలో మరో ఆఫీసరు కల్పించుకుని, 'వాటీజు దిస్? నాస్టీ!' అని గద్దించాడు.

దానితో శర్మ రెచ్చిపోయాడు.

"అవును. మీ ముందు సజీవంగా నిలబడిన ఒక శర్మ జీవితం, అతని పేదరికం, అతడు పడే ఆవేదన —అంతా మీకు నాస్టీగా కనుపిస్తుంది. కానీ, ఒక అంకెల గుమాస్తా ఉద్యోగానికి, వ్యుత్పాయమైన అవసరం లేని తుఘ్లక్ రాజధాని మార్పు నిజమైన విషయంగా ఇక్కడ నిలిచింది."

"గెటవుట్!" ఎవరో ఆఫీసరు గదిమాడు.

"వెడతాను. కానీ, ఒక విషయాన్ని మాత్రం గుర్తుంచుకోమని మనవి చేస్తున్నాను. వచ్చిన నిరుద్యోగిని పట్టుకుని ఏం చదివావని అడగకండి. ఆస్తి ఏమయినా ఉందా అని అడగండి. లేకుంటే ఇన్నాళ్ళూ ఎలా బ్రతికావని అడగండి! ఆకలి కథల్నీ, వసతుల కథల్నీ అతడు చెప్పేటప్పుడు ఆలోచించండి.అవసర మనుకున్న వారికే ఉద్యోగా లివ్వండి. మా నిర్వేదనను అర్థం చేసుకోండి. గుమాస్తా ఉద్యోగాల కంతకంటే ప్రశ్న లక్కరేదండి." గడగడా అని, శర్మ బయటికి వచ్చాడు. అతడలా రాగానే చెట్టు క్రింద జనం అతని చుట్టూ గుమిగూడారు.

"ఏమండీ! ఏమడిగారు మిమ్మల్ని?" ఒక నిరుద్యోగి ఆందోళనగా ప్రశ్న.

శర్మ నవ్వి, "ప్రశ్నలు వాళ్ళు కాదండీ! మనంవేసే సమయం వచ్చింది. సమాధానాలు వాళ్ళ వంతు అవుతుంది!" అని చకచకా నడిచిపోయాడు. పైకి నవ్వుతున్నా, శర్మ కళ్ళు ఎర్రగా ఉన్నాయి!

అక్కడి వారికి అర్థం కాక శర్మవంక అయోమయంగా చూశారు. *

## ముత్యాల జల్లు

**కలకల నిస్వనముల కో**
కిల వేగ రసాల విటపి క్రేవల
మధు గీ
తుల పంచమ రాగంబున
పిలసిత వానంత వీధి వినిపించె
నహెూ!
భావకళిక విరిసి పద్య
లతాంతమై
పరిమళించె సార ఫణితు లొప్ప
ఎడదలోని పొరల హేలా
విలాసమ్ము
రస భరమ్ము రాగరంజితమ్ము
విమల గగన వీధి విహరించు
జాబిలి
తరుణ కిరణపాళి తాకు పుడమి
ఆర్ద్రహృదయగతుల యంత
రాంతరముల
పొరల సందులందు సురలు తేనె
విమల కార్యసరణి సమన
సామోదమై

ఎనగవలయు పొంది పొనగు రీతి
వలుకుతీరు లెల్ల బంధుర ప్రీతితో
శ్రేణి సేయునట్లు కెరల వలయు
మదమరాళ పంక్తి ముదమున
విహరించె
తెల్లముత్తియములు తేలినట్లు
ధవళ జలదపాళి తళతళ త్తళలతో
నింగి తెల్ల చాందినీగ మారె.
నీల మణులు పొదిగి నింగి
నేర్పరచిరో
ఉదధి యుబ్బి పోయి యురలె
నేమొ!
పాల కడలి పొంగి పైదాక
వ్రాలెనో
వెల్ల మబ్బు చాందినీగ మారె
మంచుకణము జారి మల్లికా
కుసుమమ్ము
నలముకొనియె క్రొత్త చెలువ
మొప్ప
క్రొత్త పెండ్లి కూతు కుంతలో
చ్చయముపై

వేపు వలిప మొకటి వ్రాలినట్లు
తెలి వలిపపు పయ్యెదలో
వలయములై భావము కుళ
పంక్తి చెలంగెన్
కలికి తన మెల్ల యెడలను
పితికించెను వాన జల్లు సిరి
పురులు కొనన్
చందన చర్చా సౌరభ
మందపు వక్షముల జేరి
హార్గత నెలవన్
మందగతి కుందరదనలు
విందున వడ్డింప నొరగె వేసగి
యెండల్
కలవ-శీ నాదము గో
కుల మ-తయు మలగి మదుల
కుతుకము కూర్చెన్:
తొలకరిలో విద్యుల్లత
పలు భంగుల నాట్యమాడి
ప్రమదము కూర్చెన్

**-పోచిరాజు శేషగిరిరావు**